సాక్షి తిరుపతి

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



పట్టు తప్పిన కేంద్రం
నేలపట్టు పక్షుల కేంద్రం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. అయితే ఇక్కడ చెరువుల్లో నీళ్లు, వసతులు లేవు. - 8లో



తిరుమల ఘాట్‌లో ప్రమాదం
తిరుమల మొదటి ఘాట్ చివరి మలుపులో ఓ జీపు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ముగ్గురు గాయపడ్డారు. - 8లో



మళ్లీ ఏడి'పింఛన్'
పేదలు, వికలాంగులకు మళ్లీ పింఛన్ కష్టాలు మొదలయ్యాయి. బాధితులు కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

3 నుంచి డిగ్రీలో గ్రూపుల మార్పునకు అవకాశం

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఉన్నత విద్యామండలి గ్రూపుల మార్పునకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఈ నెల 3, 4 తేదీల్లో విద్యార్థులు తాము ప్రవేశం పొందిన సబ్జెక్టుకు సంబంధించిన కోర్సు నుంచి తమకు ఇష్టమైన మరో సబ్జెక్ట్‌కు చెందిన డిగ్రీ కోర్సులోనికి మార్పు చేసుకునే వెసులుబాటు కల్పించింది. అలాగే ఇదివరకే అడ్మిషన్లు పొందిన విద్యార్థులు కళాశాల మార్పు కోసం బదిలీ సర్టిఫికెట్ తీసుకునేందుకు మంగళవారం రోజున అవకాశం కల్పించారు.

స్విమ్స్‌లో 4న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి ఎమ్మెస్సీ (నర్సింగ్), ఏహెచ్‌ఎస్, పీజీ డిప్లొమా వంటి పలు కోర్సుల్లో 53 సీట్లు ఖాళీలు ఖాళీగా ఉన్నాయని రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్ణీత ఫీజుతో స్విమ్స్ కమిటీ హాల్ (పాత డైరెక్టర్ కార్యాలయం) జరిగే స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఎమ్మెస్సీ నర్సింగ్‌లో 19, ఎమ్మెస్సీ క్లినికల్ వైరాలజీలో ఒకటి, ఎమ్మెస్సీ కార్డియాక్ క్యాథెటరైజేషన్ టెక్నాలజీలో ఒక్కటి, ఎమ్మెస్సీ కార్డియో పల్మనరీ పర్ఫ్యూషన్ టెక్నాలజీలో రెండు, పీజీ డిప్లొమో ఇన్ మెడికల్ రికార్డ్ సైన్సెస్‌లో ఏడు, పోస్ట్ బేసిక్ డిప్లొమో ఇన్ నర్సింగ్ ప్రొగ్రామ్‌లో 23 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

డిగ్రీ పరీక్షలకు 21లోపు ఫీజు చెల్లించాలి

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ కు సంబంధించి నవంబర్, డిసెంబర్‌లో జరగనున్న పరీక్షలకు ఫీజులను ఈ నెల 21లోపు చెల్లించాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గడువులోపు పరీక్ష ఫీజులను చెల్లించాలని, లేకుంటే వర్సిటీ నిర్ణయించిన అపరాధరుసుంతో ఈ నెల 31లోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అనువాదానికి భాషాజ్ఞానం ప్రధానం



అనువాద గ్రంథాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతిసిటీ: అనువాద ప్రక్రియకు భాషాజ్ఞానం పూర్తిస్థాయిలో ఉండాలని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు అభిప్రాయపడ్డారు. సోమవారం సంస్కృత వర్సిటీలో అంతర్జాతీయ అనువాద దినోత్సవం పురస్కరించుకుని ట్రాన్స్‌లేషన్ టెక్నిక్స్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై రెండు రోజులపాటు జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ అనువాదమనేది జ్ఞానాన్ని ఇతరులకు అందించే ఒక గొప్ప సాధనమన్నారు. సంస్కృతభాషలో గొప్ప గ్రంథాలను భారతీయభాషల్లోకి అనువదించినప్పుడు ఆ జ్ఞానం అందరికీ అందుతుందన్నారు. సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వర్సిటీలోని అనువాద విభాగం ద్వారా అనువాదం ఎలా చేయాలన్న అంశం పైన శిక్షణ ఇచ్చామన్నారు. ప్రత్యేకించి సంస్కృతంలోని గ్రంథాలను భారతీయ భాషలలోకి అనువాదం చేసే ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లాలనే సత్సంకల్పంతో వర్సిటీ పనిచేస్తుందన్నారు. సుమారు 120 గ్రంథాలను ఇప్పటివరకు అనువాదం చేసినట్లు తెలిపారు. అనంతరం అతిథులు భారతరత్న–అంబేడ్కర్ వర్యస్య సూక్తిమౌక్తికాని'' అనే గ్రంథాన్ని విడుదల చేశారు. విద్వాన్ జనార్దన్ హెగ్డే, అకడమిక్ డీన్ రజనీకాంత శక్లా, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ఎస్ లత, కోఆర్డినేటర్లు నందనరావు, కనపాల కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ లైన్ ఏటీసీ వద్దకు చేరింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,066 మంది స్వామివారిని దర్శించుకోగా 29,044 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని పేర్కొంది.

మిత్ర భేదం



ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో కూటమి నేతలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి గ్రూపు రాజకీయాలకు శ్రీకారం చుడుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎవరికి వారే యమునాతీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. కొందరు టీడీపీ నేతలు నువ్వా.. నేనా? అన్నట్టు సెటిల్‌మెంట్లకు దిగుతూ అడ్డంగా దోచుకుతింటున్నారు. తామేమీ తక్కువ కాదంటూ చిత్తూరు నుంచి వచ్చిన షాడో ఎమ్మెల్యేలు దందాలకు దిగుతూ స్థానికులకు చుక్కలు చూపిస్తున్నారు. కూటమిలో తమకు గుర్తింపులేదంటూ బీజేపీ నేతలు లోలోనే రగిలిపోతుండగా.. ఇంతకాలం జెండా మోసిన తమను పట్టించుకోలేదంటూ జనసేన నేతలు కొందరు కత్తులు నూరుతున్నారు. మంగళవారం తిరుపతికి విచ్చేయనున్న తమ పార్టీ అధినేత వద్దే తేల్చుకుంటామంటూ తెగేసి చెబుతున్నారు.

కూటమిలో కుంపట్లు

- ప్రజా సమస్యలు గాలికొదిలేసి గ్రూపులు. కుట్రలు..కొట్లాటలు
- ఎవరికి వారే చందాన మూడు పార్టీల నేతలు
- తిరుపతిలో రెచ్చిపోతున్న షాడో ఎమ్మెల్యేలు
- సెటిల్‌మెంట్లు. దందాలతో బెంబేలెత్తుతున్న నగరవాసులు
- నేడు డెప్యూటీ సీఎం వద్ద పంచాయితీకి సిద్ధం!

సాక్షి ప్రతినిధి తిరుపతి: కూటమి ప్రభుత్వం ఏర్పడి పట్టుమని వందరోజుల గడిచాయో లేదో తిరుపతి నియోజకవర్గంలో కుట్ర రాజకీయాలకు తెరలేపారు. తిరునగరి సమస్యలను పక్కన పెట్టి, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు తమదే పైచేయి కావాలంటూ ఎవరికి వారు కుట్ర రాజకీయలు చేస్తున్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్థానికుడు కాకపోవడం, ఆయనకు సొంత పార్టీ నుంచే అసమ్మతి సెగలు రేగడం, చిత్తూరు రాజకీయాలను నగరంపై రుద్దడమే ప్రధాన కారణం. ఎమ్మెల్యే దిష్టిబొమ్మతో సమానమంటూ బాహాటంగానే ఆయనపై నగర టీడీపీ, బీజేపీ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. కనీసం మాట వరసకైనా ఆయనను పలుకరించిన పాపాన పోలేదు. కూటమి నేతల విభేదాలు ఒక ఎత్తైతే.. మరో పక్క జనసేన పార్టీలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. పేరుకే ఆయన ఎమ్మెల్యే..అంతా ఆయన బంధువర్గం, ప్రధాన అనుచరులదే నగరంలో హవా కొనసాగుతోంది.

షాడో ఎమ్మెల్యేల ఇష్టారాజ్యం

తిరుపతిలో ఎమ్మెల్యే అంటే సామాన్య ప్రజలకు తెలియదంటే ఆశ్చర్యపోవాల్సిందే. తన అనుచరవర్గంతో షాడో ఎమ్మెల్యేలను తయారు చేసి, నిత్యం దందాలు, సెటిల్‌మెంట్లు, బెదిరింపు రాజకీయాలు చేయిస్తున్నారు. ప్రధానంగా ఎమ్మెల్యే కుమారుడు మదన్, ఎమ్మెల్యే సోదరుని తనయుడు ఆరణి శివకుమార్, నగర జనసేన అధ్యక్షుడు రాజారెడ్డి, చిత్తూరుకు చెందిన రౌడీమూకలు బ్యాచ్‌లుగా ఏర్పడి తిరుపతి నగరాన్ని పంచుకుంటున్నారు. తాము ఫలానా ఏరియాను చూసుకుంటామంటూ ఎమ్మెల్యేకే నేరుగా హుకుం జారీ చేస్తున్నారు. భూసెటిల్ మెంట్ పంచాయితీలు, అనధికార లేఅవుట్లు అంటూ రియల్టర్లను బెదిరించి వసూళ్లు, ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసి రిజిస్ట్రేషన్ల కోసం రెవెన్యూ అధికారులను బెదిరించడం, కళాశాల సీట్లు తమకే ఇవ్వాలంటూ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలను బెదిరించి ముడుపులు సేకరించడం చేస్తున్నారు. నగరపాలక సంస్థలో కొన్ని రోజులకు ముందు జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే స్థానంలో షాడో ఎమ్మెల్యేగా తన సోదరుని తనయుడు శివకుమార్ అధికార కుర్చీలో కూర్చొని అధికారులను ఆదేశించిన విషయం పచ్చ పత్రికలు సైతం కోడై కూసిన విషయం విదితమే.

నేడు పవన్‌కళ్యాణ్ వద్ద పంచాయితీ

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుమల పర్యటన నేపథ్యంలో టీడీపీ, జనసేనకు చెందిన అసమ్మతి నేతలు ఆయన వద్ద ఎమ్మెల్యే తీరుపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. నగరంలో షాడో ఎమ్మెల్యేల అరాచకాలు, వసూళ్ల పర్వం, గ్రూపు రాజకీయాలు, ప్రభుత్వ అధికారులపై బెదిరింపులు, ఎమ్మెల్యే వ్యవహార శైలిపై ప్రత్యేకంగా పంచాయితీ పెట్టి అటో..ఇటో..తేల్చుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.

తారాస్థాయికి చేరిన కూటమి విభేదాలు

కూటమి నేతల సమన్వయలోపంతో ఒక్కసారిగా కుట్ర రాజకీయాలు భగ్గుమన్నాయి. ఆది నుంచి ఆరణి శ్రీనివాసుల అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన స్థానిక టీడీపీ నేతలు ఆయనతో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యే దిష్టిబొమ్మ అంటూ బహిరంగంగానే ఆయనపై విమర్శలు గుప్పిస్తున్నారు. టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సుగుణమ్మ గ్రూపు చాపకింద నీరులా రాజకీయం చేస్తుండగా, అదే పార్టీకి చెందిన జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి నరసింహయాదవ్ గ్రూపు నామినేటెడ్ పదవుల పంపకం వరకు వేచి చూసే ధోరణిలో ఉంది. మరోపక్క కొత్తగా టీడీపీ నాయకుడు రవినాయుడు అనుచరులుగా మరో గ్రూపు తయారైంది. టీడీపీకి చెందిన మూడు గ్రూపులు సైతం ఎమ్మెల్యేపై విరుచుకుపడుతూ షాడో ఎమ్మెల్యే బెదిరింపు రాజకీయాలపై విమర్శలు గుప్పిస్తున్నారు.

బీజేపీని ఆమడ దూరంలో పెట్టిన ఎమ్మెల్యే వర్గం

తిరుపతి నగరంలో బీజేపీకి నలుగురు నాయకులు తప్ప, కార్యకర్తలు, ప్రజల అండ శూన్యం అంటూ ఎమ్మెల్యే వర్గానికి చెందిన కొందరు వెటకారంగా చర్చించుకోవడం గమనార్హం. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను స్థానిక బీజేపీ నేతలు పట్టించుకున్న పాపాన పోలేదు. తిరుపతికి తామే కింగ్ మేకర్లమంటూ ప్రగల్భాలు పలుకుతూ ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో మీడియాను నమ్ముకుని కాలం వెల్లదీస్తున్నారు. ఆ పార్టీకి చెందిన భానుప్రకాష్‌రెడ్డి టీటీడీ పాలకమండలిలో తమకు స్థానం కల్పిస్తారనే ఆశతో ప్రతినిత్యం తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలతో రాజకీయ క్రీడలు మొదలు పెట్టారు. బీజేపీ నేతల వ్యవహార శైలి, స్వార్థరాజకీయాన్ని పసిగట్టిన ఎమ్మెల్యే వర్గం చెంతకు చేరకుండా ఆమడ దూరంలో పెట్టింది.

జనసేనలో గ్రూపు రాజకీయాలు, బహిరంగ కుమ్ములాటలు

తిరుపతి జనసేన పార్టీలో గ్రూపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. బహిరంగంగా ఎమ్మెల్యే సాక్షిగా బెదిరింపులు, కుమ్ములాటలకు తెరతీశారు. ప్రస్తుతం నగరంలో మూడు గ్రూపులుగా తయారైన జనసేన కార్యకర్తల్లో తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కిరణ్ రాయల్ తొలి నుంచీ ఎమ్మెల్యేని వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే వేరే పార్టీ నుంచి.. వేరే నియోజకవర్గం నుంచి వచ్చినప్పటికీ తిరుపతిలో గెలిపిస్తే తమను పట్టించుకోవడం లేదనేది ఆయన ఆగ్రహానికి కారణం. ఎమ్మెల్యేకి చెందిన చిత్తూరు వ్యక్తులు తిరుపతిలో నిత్యం తగాదాలు పెట్టుకుని తలనొప్పిగా తయారయ్యారని ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. కాగా కిరణ్‌రాయల్ తాను ఒక్కడినే జనసేనాని పవన్ కళ్యాణ్ అనుచరుడినంటూ నగరంలో పార్టీ, నామినేటెడ్ పదవుల నియామకాలు జరిగినా తనకు తెలపాలంటూ నిలదీస్తున్నారు. మరో పక్క జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ కూడా ఎమ్మెల్యే అనుచరవర్గం షాడో ఎమ్మెల్యేల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేద్దాం



అవార్డులు అందుకున్న వారితో కలెక్టర్, జేసీ, డీఆర్వోలు

తిరుపతి అర్బన్: జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేద్దామని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 27వ తేదీన విజయవాడలో అవార్డులు అందుకున్న జిల్లా వాసులను సోమవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా పర్యాటక, ఆతిథ్యరంగం ప్రమోషన్‌లో ఉత్తమ జిల్లాగా తిరుపతి ఎంపికైన నేపథ్యంలో టూరిజం ప్రాంతీయ సంచాలకులు రమణప్రసాద్, జిల్లా అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, ఉత్తమ టూరిస్ట్ ఫ్రెండ్లీ రైల్వేస్టేషన్‌గా ఎంపికైన తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఆతిథ్యరంగంలో ఉత్తమ ఫైవ్‌స్టార్ హోటల్‌గా ఎంపికైన తాజ్ జనరల్ మేనేజర్ రితేష్ చౌదరి, ఉత్తమ సోషల్ మీడియా ఇన్ఫ్లూయన్సర్‌గా ఎంపికైన శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఫైనల్ ఇయర్ లా విద్యార్థి ఇందిరా ప్రియదర్శిని, ఏపీ ఆర్ట్ అండ్ కల్చర్ కేటగిరిలో టూరిజం ప్రమోషన్‌కు కృషి చేసిన కృష్ణమూర్తి, ఏర్పేడు మండలంలోని మాధవమాల బాలాజీ ఉడ్ క్వారింగ్ ప్రతినిధులను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిషోర్ సోమవారం దుశ్శాలువలతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో టూరిజం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. జిల్లాలో 35శాతం అట వీ ప్రాంతం ఉందని చెప్పారు. రాష్ట్రంలో అటవీ ప్రాంతం అధికంగా ఉన్న రెండో జిల్లా తిరుపతిగా పేర్కొన్నారు. జిల్లాకు రోజు 80 వేల మంది యాత్రికులు వచ్చిపోతుంటారన్నారు. 2023–24లో 4.16 కోట్ల మంది యాత్రికులు జిల్లాకు వచ్చి వెళ్లినట్లు లెక్కలున్నాయన్నారు. వారిలో 15శాతం రెండురోజుల పాటు జిల్లాలో బస చేస్తే రాబడి మరింత పెరుగుతుందని చెప్పారు.

కూర కరువాయే!



నిత్యం ఏ కూర చేయాలన్నా అందులోకి నూనె అవసరం. అయితే నేడు వంట నూనెల ధరలు ఒక్కసారిగా నింగినంటాయి. దీంతో సామాన్యుడి వంటింట్లో పొయ్యి వెలగడం లేదు. ధరల దరువుతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏం తినాలన్నా.. ఏ నూనె కొనాలన్నా వెనుకాముందు ఆలోచించాల్సి వస్తోంది. భోజనం బరువు అవుతోంది. ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతోంది. గంజి అన్నమే గతవుతోంది.

- పేదలను కలవరపెడుతున్న వంటనూనె ధరలు
- సామాన్యులపై కేంద్రం మరో పిడుగు
- సుంకాలను భారీగా పెంచిన కేంద్రం
- లీటర్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు అదనపు భారం
- జిల్లాలో 5.65 లక్షల కుటుంబాలపై ప్రభావం
- మండిపడుతున్న సామాన్య ప్రజలు

తిరుపతి అర్బన్: సామాన్యుడి వంటింట్లో నూనె మంట రాజుకుంటోంది. కొద్ది రోజులుగా స్థిరంగా ఉన్న నూనెల ధరలు ఒక్కసారి భగ్గుమన్నాయి. రెండు రోజుల వరకు సాధారణ ధరలకు నూనె ప్యాకెట్లు విక్రయించిన వ్యాపారులు ఒక్కసారిగా సోమవారం నుంచి నూనె ప్యాకెట్లను బ్లాక్ చేయడం, అధిక ధరకు విక్రయించడం ప్రారంభించారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి కనిపించింది. దీంతో జిల్లాలోని 5.65 లక్షల కుటుంబాలకు చెందిన కొనుగోలుదారులు అయోమయ పరిస్థితిలో పడిపోయారు. శుద్ధి చేసిన ఎడిబుల్ ఆయిల్స్‌పై కేంద్ర ప్రభుత్వం 20 శాతానికి పైగా దిగుమతి సుంకం పెంచడంతో నూనె ధరలకు రెక్కలొచ్చాయి. లీటర్ నూనెపై ఏకంగా దాదాపు 30 శాతం ధరలు పెరగడంతో పేదోడు, సామాన్యుడి మీద పెనుభారమే పడుతోంది. ముందే సరైన పంటలు పండక రైతులు, కూలీలు, సంక్షేమ పథకాలు అందక పేద ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్న తరుణంలో పెరిగిన వంటనూనెల ధరలు మరింత కలవరపడేలా చేస్తున్నాయి. దీంతో జనానికి కంగారు పుట్టిస్తున్నాయి. ఏం తినాలో తెలియక ఆందోళన రేకెత్తిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలో వచ్చి మూడు నెలలు దాటుతున్నా ధరల నియంత్రణకు వెనుకడుగు వేస్తున్నాయి. వంట గదిలోకి వెళితే చాలు పప్పు నుంచి ఉప్పు వరకూ, కూరగాయల నుంచి ఉల్లిపాయల వరకు.. ఏం కొనాలన్నా ధరలు చూసి భయపడాల్సివస్తోంది. ఓ వైపు నిత్యావసరాల ధరలు.. మరోవైపు కూరగాయల ధరలు నింగినంటుతున్న తరుణంలో, తాజాగా నూనె ధరలు ఇలా పెరగడంతో ఎలా తినాలి.. ఏం తినాలని సామాన్యుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

పెరిగిన నూనె ధరలిలా...

మార్కెట్‌లో పామాయిల్ రూ. 95 ఉండగా నేడు రూ.106కి పెంచారు. రిఫైండ్ ఆయిల్ రూ.106 ఉంటే రూ.116కి పెంచేశారు. అలాగే వేరుశనగ నూనె రూ.150 నుంచి రూ.160కు పెంచారు. దిగుమతి సుంకం అమల్లోకి వస్తే లీటర్‌కు అదనంగా రూ.20 వరకు పెరగనుందని కొందరు, మరికొందరు వ్యాపారులైతే రూ.30 నుంచి రూ.40 పెరుగుతుందని చెబుతున్నారు. మొత్తంగా ఏ స్థాయికి పెంచుతారోనని జనం ఆందోళన చెందుతున్నారు

కేంద్రం నూనెల మంట

కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై సుంకాన్ని భారీగా పెంచింది. పామాయిల్, సన్‌ఫ్లవర్, సోయాబీన్ తదితర వంట నూనెలకు సంబంధించిన ముడి సరుకుల దిగుమతిపై గతంలో ఎటువంటి (బేసిక్ కస్టమ్స్ డ్యూటీ) సుంకాలు లేవు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వాటిపై 20 శాతం మేరకు దిగుమతి సుంకాన్ని విధించింది. అలాగే శుద్ధి (రిఫైన్డ్ వంట నూనెలపై గతంలో 12.5 శాతం ఉన్న సుంకాన్ని 32.5 శాతానికి పెంచేసింది.) దీంతో ప్రతి లీటర్ ప్యాకెట్‌కు రూ.30 అదనపు భారం పడుతుంది. వంట నూనెల పెరుగుదలతో జిల్లాల్లో ప్రతి నెలా 5.56 కుటుంబాలకు రూ. 4.5 కోట్ల భారం పడనుంది. ఒక్కో కుటుంబం నెలకు సగటున ఐదు కిలోల వంట నూనె వినియోగిస్తుంది. ప్రతి నెలా ఒక్కొక్కరిపై రూ.130 నుంచి రూ.160 వరకూ అదనపు భారం పడనుంది. కేంద్ర ప్రభుత్వం విధించిన సుంకాలను తగ్గించాలని అంతా డిమాండ్ చేస్తున్నారు.

ఒక్కసారిగా ఇంత పెంచడం సరికాదు



నూనె లేనిదే వంట చేయలేము. నిత్యం ఉపయోగించే వంట నూనెల ధరలు ఒకేసారి ఇంత దారుణంగా పెంచడం సరికాదు. వీటి ధరల నియంత్రణకు ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలి. రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై వంట నూనెలను సరఫరా చేసేలా చూడాలి. అప్పుడే పేదలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలి. లేదంటే ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత తప్పదు.
–సుబ్బలక్ష్మమ్మ, గృహిణి.

ధరల స్థిరీకరణ ఉండాలి



ఎలా పడితే అలా ధరలు పెంచితే ఎలా బతకాలి. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి, ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. వంట నూనెల ధర పెరిగిపోవడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు అండగా ఉంటామని ఎన్నికల సమయంలో చెప్పిన మాటలను నేతలు మరిచిపోయారు. ఇలా ధరలు పెంచితే పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎలా జీవించాలి. వెంటనే పెంచిన సుంకాలను తగ్గించాలి.
–లక్ష్మి ,గృహిణి

అన్ని వస్తువులూ రేషన్ షాపుల్లో ఇవ్వాలి



రేషన్ దుకాణాల్లో గతంలో కందిపప్పు, నూనె, చక్కెర, సబ్బులు, రాగులు, గోధుమ పిండి తదితర అన్ని వస్తువులు ఇచ్చేవారు. ప్రస్తుతం కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. ఇప్పటికే కందిపప్పు ధరలు ఎక్కువగా పెరిగాయి. తాజాగా నూనె ధరలు పెరగడంతో సామాన్యులు కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొంది. అన్ని వస్తువులూ రేషన్ షాపుల్లోనే ఇవ్వాలి –సరోజనమ్మ, గృహిణి

రాయితీపై ఇవ్వాలి



నూనెల ధరలకు అడ్డుకట్ట వేయాలి. చౌకదుకాణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నూనెను రాయితీపై అందించాలి. రేషన్ దుకాణాల్లో గతంలో నూనె ఇచ్చేవారు. ప్రస్తుతం ఇవ్వడం లేదు. తిరిగి ఇవ్వాలని కోరుతున్నాం. అలాగే ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి, భవిష్యత్‌లో ధరలు పెరిగినా సామాన్య ప్రజలకు భారం లేకుండా చూడాల్సి ఉంది. –ప్రనూష, గృహిణి

ధరలు నియంత్రించాలి



మాది సామాన్య రైతు కుటుంబం, పంటలు పండితేనే కుటుంబం గడుస్తుంది. లేకపోతే అప్పులతో నెట్టుకురావాలి. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ఏమీ కొనలేకపోతున్నాం. ఇప్పుడు మళ్లీ నూనె ధరలు అమాంతంగా పెరిగాయి. నిత్యావసర సరుకుల ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం ధరలను నియంత్రించాలి. లేదంటే సామాన్యుడికి అప్పులు తప్పవు. –రత్నకుమారి, గృహిణి

పేదలపై అదనపు భారం



ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగాయి. ఇప్పుడు వంటనూనెల ధరలు కూడా పెరగడంతో పేదలు ఏమీ కొనలేని పరిస్థితి నెలకొంది. ఒక్కసారిగా ధరలు పెరగడం సామాన్యులపై భారం మోపడమే. నిత్యావసర సరుకులు, నూనెల ధరలు పేదలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఏమీ పట్టనట్లు ఉంటే ఎలా. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.
–చిన్నక్క, గృహిణి

యువ మేధావులే లక్ష్యంగా

నూతన విద్యావిధానం



ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, సీబీఎస్‌ఈ ప్రిన్సిపాళ్లు

తిరుపతి సిటీ: భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొనే సత్తా కలిగిన యువ మేధావులను తయారు చేసేందుకు నూతన విద్యావిధానం –2020 ఎంతో దోహదపడుతుందని మహిళా వర్సిటీ వీసీ వి ఉమ అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా వర్సిటీలో రెండు రోజుపాటు జరిగే జాతీయ స్థాయి ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి, ప్రసంగించారు. గురువులు తమ జ్ఞానం, నైపుణ్యాలు, నైతిక విలువలను విద్యార్థులకు అందించడమే సమాజం ఉపాధ్యాయులకు అప్పగించిన బాధ్యత అన్నారు. సీబీఎస్‌ఈ నైపుణ్య విద్యా విభాగం కార్యదర్శి రాజీవ్ పాండే మాట్లాడుతూ మహిళా వర్సిటీలో 35వ ఎక్స్‌పోజర్ విజిట్ జరుగుతోందన్నారు. ప్రతి పాఠశాలలో ఒక నైపుణ్య విషయాన్ని తప్పనిసరిగా చేర్చి, విద్యార్థులకు సరికొత్త సాంకేతిక పోకడలపైన అవగాహన కల్పించాలన్నారు. రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్లు ఆముదవల్లి, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మీకోసం- ప్రజా పరిష్కార వేదికకు 85 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు నేరుగా ఎస్పీని సంప్రదించి 85 ఫిర్యాదులు అందజేశారు. ఆ ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు ఆయన బదిలీ చేశారు. ఈ ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు. బాధితులకు ఏమీ న్యాయం చేరన్న విషయం, త్వరలోనే తమ కార్యాలయంలో తెలియజేయాలని ఆదేశించారు. ఇందులో చోరీలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఇతర ఫిర్యాదులు అందినట్లు ఆయన పేర్కొన్నారు.

పట్టు తప్పిన కేంద్రం

కరుణించని వరుణుడు.. జాడలేని మేఘం.. కురవని వర్షం.. కనుచూపు మేర కనిపించని నీటి జాడ.. వెరసి.. నేలపట్టు పక్షుల కేంద్రం పరిధిలోని చెరువులన్నీ బీళ్లుగా దర్శనం.. ఫలితం వలస పక్షులకు కరువైన ఆవాసం.. దీనికితోడు విడుదల కాని నిధులు.. ప్రతిపాదనలకే పరిమితం.. వసతులు మృగ్యం.. అయినా నేటి నుంచి నేలపట్టు పక్షుల కేంద్రం .. ప్రారంభం.. ఇప్పటికైనా నిధులు మంజూరయ్యేనా? వర్షాలు కురిసి నేలపట్టు కళకళలాడేనా? లేక పక్షి ప్రేమికులకు నిరాశే మిగిలేనా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

- నేలపట్టులో ఎండిన చెరువులు.. కానరాని పక్షుల జాడ
- వసతుల కల్పనకు రూ.86 లక్షలతో ప్రతిపాదనలు
- మంజూరు కాని నిధులు
- నేటి నుంచి పక్షుల కేంద్రం ప్రారంభం



పక్షుల కేంద్రంలో పిల్లల పార్కు



పక్షుల కేంద్రంలోని చెరువు దుస్థితి

దొరవారిసత్రం: పక్షి ప్రేమికులను కనువిందు చేసే ప్రకృతి అందాలు సీజన్ నేటి నుంచి మొదలు కానుంది. సీజన్ మొదలవుతున్నా వరుణ దేవుడు కరుణించక కేంద్రంలోని చెరువులన్నింటిలో చుక్క నీరు లేకుండా ఎండిపోయి ఏడారిగా దర్శనమిస్తున్నాయి. చేసేదేమీ లేక కేంద్రంలో వలస విహంగాల జాడలేకపోయిన టికెట్ కౌంటర్ వద్ద ఉన్న ప్రధాన కేంద్రం గేట్లను మంగళవారం వన్యప్రాణి విభాగం అధికారులు ప్రారంభించనున్నారు. ఇది ఇలా ఉండగా విదేశీ శీతకాలంలో వలస విహంగాలకు సంతానోత్పత్తి కేంద్రంగా బాసిల్లుతున్న నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ఇటు సందర్శకుల కోసం, అటు పక్షుల కోసం చేయాల్సిన ఏర్పాట్లన్నీ ప్రతిపాదనలకే పరిమితమైయ్యాయే తప్ప, కార్యరూపం దాల్చలేదు. విహంగాల సీజన్ ప్రారంభం అయినప్పటికీ కేంద్రంలో పలు ఏర్పాట్ల కోసం, వివిధ పనుల మరమ్మతుల కోసం స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు రూ.86 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపినట్లు తెలిపారు. ఇందులో కొంత మేరకు కూడా నిధులను మంజూరు కాకపోవడంతో కేంద్రంలో సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాట్లు ఎలా చేయాలని అధికారులు అంటున్నారు.

స్థానిక పక్షులు ఈ పాటికే..

వాతవరణం అనుకూలించి వర్షం కురిసి ఉంటే ఈ పాటికే స్థానికంగా సంచరించే ప్రసిద్ధి చెందిన నత్తగుల్ల కొంగలు, స్వాతి కొంగలు, శబరి కొంగలు తదితర పక్షులు నేలపట్టు పక్షుల కేంద్రంలోని అత్తిగుంట చెరువు, నేరేడుగుంట చెరువు, మారేడుగుంట చెరువుల్లోని కడప చెట్లపై చేరి ఉండాలి. కానీ ఇప్పటివరకు వర్షాలు కురవకపోవడంతో కేంద్రంలో చెరువుల్లో చుక్కనీరు లేకుండా బోసిపోయాయి. విహంగాల సీజన్ అక్టోబర్‌లో మొదలై ఏప్రిల్‌కు ముగుస్తుంది. ఈ ఏడు నెల సమయంలో కేంద్రంలో ఆయా జాతులను అభివృద్ధి చేసుకునేందుకు విచ్చేసే వలస విహంగాలన్నీ పక్షుల కేంద్రానికి వచ్చి, తొలుత ఆడ, మగ పక్షులు స్నేహం కుదుర్చుకుని చెరువుల్లో ఉన్న కడప చెట్లపై గూళ్లు కట్టుకుని జత కట్టి గుడ్లు పెట్టుతాయి. పిల్లలు పొదిగిన తరువాత ఎక్కువగా మగ పక్షి పిల్లల దగ్గర సంరక్షడిగా వ్యవహరించగా ఆడ పక్షి చేపలను వేటాడి పిల్లలకు ఆహారంగా అందిస్తాయి. పిల్లలకు చెరువు నీటిలో ఈత నేర్పిన తరువాత ఎగిరే స్థాయికి చేరుకోగానే ఆయా దేశాలు వెనుతిరిగి వెళ్లిపోతాయి. అయితే ఈ ఏడాది వర్షం కురవకపోవడంతో చెరువుల్లో నీళ్లు లేక పక్షులు ఇంకా రాలేదు.

> **ప్రతిపాదనలు పంపాం**
>
> 
>
> నేలపట్టు పక్షుల కేంద్రంలో పలు ఏర్పాట్లు, వసతుల కోసం రూ.86 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపాం. కానీ ఇప్పటివరకు ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. నిధులు లేనిదే కేంద్రంలో ఎలాంటి అభివృద్ధి పనులు కాని చేపట్టలేం. అక్టోబర్ 1వ తేదీన టికెట్ కౌంటర్ ప్రారంభించనున్నాం.
>
> -ఎం బాలయ్య, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, నేలపట్టు పక్షుల కేంద్రం

ఏటా ఈ పనులు తప్పనిసరి

ప్రతి ఏటా పక్షుల సీజన్‌లో సందర్శకుల కోసం తాగునీటి సరఫరాకు చెందిన పలు మరమ్మతులు తప్పక చేయాల్సి ఉంటుంది. అలాగే చెరువు కట్టపై, పక్షుల కేంద్రం మార్గం వెంబడి నిర్వహణ పనులతో పాటు రోడ్లు మరమ్మతులు, పిల్లల పార్కులోని ఆట వస్తువులు మరమ్మతులు చేయాలి. అంతేకాకుండా గత ఏడాది మించాంగ్ తుపాన్‌తో అత్తిగుంట చెరువు కలుజు, సప్లయ్ చానళ్లు, రోడ్లు పాడైపోయాయి. వీటిని తప్పనిసరిగా మరమ్మతులు చేయాల్సి ఉంది. వీటితో పాటు ఈసారి అదనంగా సందర్శకుల సౌకర్యార్థం కేంద్రం పరిధిలోని అటవీ ప్రాంతంలో సఫారీ రోడ్డు ఏర్పాటు, ప్రధాన గేట్లు వద్ద మహిళల కోసం మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనులు చేపట్టడం కోసం ప్రతిపాదనలు పంపినట్లు వన్యప్రాణి అధికారులు తెలిపారు. గత ఏడాది ప్రవేశ రుసుం వసూలు రూ.10 లక్షలు పైగా వచ్చిందని తెలిపారు.

పక్షుల కేంద్రంలో సిబ్బంది కొరత

నేలపట్టు పక్షుల కేంద్రంలో గత కొన్నేళ్లుగా ఫారెస్టు సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది. ఈ విషయంలో ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సిబ్బంది కొరతతో పక్షుల సీజన్ సమయంలో సందర్శకులకు సదుపాయాలు, వసతులు సమకూర్చలేని దుస్థితి ఏర్పడుతుంది. స్థానికంగా ఏబీఓ(అసిస్టెంట్ బీట్ ఆఫీసర్) ఆరుగురు, ఎఫ్‌బీఓ(ఫారెస్ట్ బీట్ ఆఫీసర్)నలుగురు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ ఉండాలి. ఇందులో ఫారెస్ట్ సిబ్బందిలో 10 మందికి గాను ఎఫ్‌బీలో ఇద్దరే ఉన్నారు. వీరిలో ఒకరు సెప్టెంబర్ 30న ఉద్యోగ విరమణ పొందారు. ఇంకా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మాత్రం ఉన్నారు. రేంజర్ ఆఫీసర్ ఏడాదిగా ఇన్‌చార్జితోనే సరిపెట్టుతున్నారు.

శ్రీవారి గొడుగులకు పూజలు



శ్రీవారి గొడుగుల పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, వివిధ సంఘాల నేతలు, స్థానిక భక్తులు

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల శ్రీవారికి సమర్పించేందుకు చెన్నైకు చెందిన హిందూ ధర్మార్థ సమితి ట్రస్టీ ఆర్.ఆర్.గోపాల్‌జీ ... పోవైసీ అలిమేలు మంగమ్మ అండ్ ట్రస్టు వారు గొడుగులతో సోమవారం తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి గొడుగులకు శ్రీకోదండరామస్వామి ఆలయాధికారులు డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్, కాపునాడు నేత సరితా నాగరాజు, స్థానిక భక్తులు ఘన స్వాగతం పలికి, పూజలు చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విచ్చేసి పూజలు నిర్వహించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, కార్పొరేటర్లు పొన్నాల చంద్ర, నారాయణ, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఆముదాల తులసీరామ్, నరసింహులు నాయుడు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, నైనారు మహేష్ యాదవ్, శరత్ పాల్గొన్నారు.

మళ్లీ.. ఏడి‘పింఛన్’

- నాలుగు నెలలుగా అధికారుల చుట్టు పింఛన్ కోసం ప్రదక్షిణ
- పక్షవాతంతో ఆగచాట్లు...అయినా పట్టించుకోని అధికారులు
- గ్రీవెన్స్‌కు 187 అర్జీలు



గ్రీవెన్స్‌లో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: పేదలు, అనాథలకు పింఛన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. కూటమి సర్కార్ అర్హులకు సైతం పింఛన్ మంజూరు చేయకపోవడంతో వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీరే ఇలాంటి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే వారు. అయితే టీడీపీ కూటమి సర్కార్ వలంటీర్లను తొలగించిన సంగతి తెలిసిందే. దీంతో పింఛన్ల కోసం కష్టాలు తప్పడంలేదు.

గ్రీవెన్స్‌కు 187 అర్జీలు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 187 అర్జీలు వచ్చాయి. అందులో 120 అర్జీలు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఇచ్చారు. పింఛన్లతోపాటు పాడుపు సంఘం సభ్యుల సమస్యలపై డీఆర్‌డీఏకి 15 అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాత్రం ఎప్పటికప్పుడు వచ్చిన అర్జీలను పరిష్కరించి సమస్యలు పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్,డీఆర్వో పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు నరసింహులు, దేవేంద్రరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఈయన పేరు ఎం.సుబ్రమణ్యం, ఎన్‌వీ కండ్రిగ గ్రామం, సూళ్లూరుపేట మండలం. మూర్చవ్యాధితో బాధపడుతున్న ఈయన, బంధువులతో కలసి సూళ్లూరుపేట ఎంపీడీఓ కార్యాలయానికి మూడు నెలలుపాటు పింఛన్ కోసం తిరిగారు. అయితే ప్రయోజనం లేదు. దీంతో ఆయనతోపాటు వారి బంధువులు నాలుగు వారాలుగా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌కు వస్తున్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతిని కలిసి ఎం.సుబ్రమణ్యం తన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వారు ఎంపీడీఓకు మేము చెబుతాం...అక్కడికే వెళ్లండి పింఛన్ రాస్తారని చెప్పి పంపించారు.



కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో డీఆర్వో పెంచల కిషోర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతికి తమ కష్టాలు వివరిస్తున్న ఎం.సుబ్రమణ్యం, ఆయన బంధువులు

ఎక్సైజ్ అధికారుల బదిలీ



చిత్తూరు అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీహరి

చిత్తూరు అర్బన్: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో పనిచేస్తున్న పలువురు సీఐలు, ఎస్ఐలను బదిలీ చేస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం ఈ మేరకు కొందరు అధికారులు బాధ్యతలు కూడా చేపట్టారు. చిత్తూరు అర్బన్ సీఐగా శ్రీహరి, చిత్తూరు రూరల్‌కు ఎ.పురుషోత్తం, నగరికి పీటీ శ్రీనివాసరెడ్డి, కార్వేటినగరానికి డి.శిరీషాదేవి, పుంగనూరుకు కె.సురేష్ రెడ్డి, పాలసముద్రానికి జి.భాగ్యలక్ష్మి, కుప్పం సీఐగా ఎ.నాగరాజు, పులిచెర్లకు ఎ.మాధవిస్వామి బదిలీ అయ్యారు. తిరుపతి జిల్లాలో తిరుపతి అర్బన్‌కు ఎం.రామచంద్ర, తిరుపతి రూరల్ ఇ.నరసనాయుడు, చంద్రగిరికి కేవీఎస్.ఫణీంద్ర, పుత్తూరుకు బి.మురళీమోహన్, శ్రీకాళహస్తికి ఐ.లావణ్య, నాగలాపురానికి కె.దశరథరామిరెడ్డి, తిరుమలకు జి.తిరుమలయ్య నియమితులయ్యారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్‌కు బి.శ్యామ్‌ప్రసాద్, చిత్తూరు టాస్క్‌ఫోర్స్‌కు కె.మోహన్, చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు పి.జవహర్‌బాబు, వైవీ పవన్‌కుమార్, కె.సత్యనారాయణ, చిత్తూరు మద్యం డిపోకు ఎం.రమణ, రేణిగుంటకు బి.ఇంద్రాణి, నరహరిపేట చెక్‌పోస్టుకు పి.కృష్ణకిషోర్, వి.కోటకు కె.కృష్ణమోహన్, క్యాటిల్‌ఫామ్‌కు వై.విజయ్‌కుమార్, పి.నాగరాజు, మొబైల్ బోర్డర్ పెట్రోలింగ్ నిమిత్తం పలమనేరుకు వై.సతీష్‌ను బదిలీ చేశారు.

ఎస్ఐలు ఇలా..

ఎస్ఐల బదిలీల్లో వై.హరికృష్ణ, ఎ.మహేష్ నరసింహ, బి.జయశంకర్‌లను తిరుపతి అర్బన్‌కు, వి.కవీశ్వరనాయుడు, బి.అంజలి ప్రసన్నలను తిరుపతి రూరల్‌కు, కె.గిరి, ఎం.సుధాకర్‌రావును చంద్రగిరికి, ఎస్.అంజాద్‌బాషా, పి.శివప్రసాద్‌ను పుత్తూరుకు, కె.భాస్కర్, ఎం.నిరంజన్‌రెడ్డిని శ్రీకాళహస్తి, కె.బాబు, టి.అన్వేష్‌ను నాగలాపురం, సి.నరేష్‌బాబును తిరుమలకు, ఎస్.స్వామినాథన్‌ను తిరుపతి ఎస్టీఎఫ్, జి.రామకృష్ణశాస్త్రి తిరుపతి మద్యం డిపోకు, ఆర్.పృథ్వీరాజ్, బి.మోహన్‌కృష్ణను చిత్తూరు అర్బన్, పి.శరవణతేజ్, ఎం.మోసెస్‌ను కార్వేటినగరం, ఏవీ రమణరాజు, ఎ.రామ్మూర్తిని చిత్తూరు రూరల్, పి.వెంకటేశులును నగరి, ఎం.వేణుగోపాల్‌రెడ్డిని పుంగనూరు, పి.భానుప్రకాష్‌ను పలమనేరు, టి.మహేంద్ర, జి.మోహన్‌బాబును కుప్పం, వి.సంధ్యను పులిచెర్ల, బి.వెంకటేశులును చిత్తూరు మద్యం డిపో, జి.అశోక్‌కుమార్‌ను చిత్తూరు ఈఎస్‌టీఎఫ్, బి.రామదాసు క్యాటిల్‌ఫామ్ చెక్‌పోస్టు, పి.పృథ్వి చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంటుకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రమాదం



ఘాట్‌రోడ్డులో చెట్టును ఢీకొన్న కారు

తిరుమల : తిరుమల రెండో ఘాట్ రోడ్డు చివరి మలుపు వద్ద ప్రైవేటు జీపు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొని అటవీప్రాంతంలోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన భక్తులు జీపులో తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని తిరిగి బయలుదేరారు. ఆఖరి మలుపు వద్ద కారు అదుపు తప్పి రోడ్డుపక్కన రక్షణగోడను ఢీకొని అటవీప్రాంతంలోకి వెళ్లి చెట్టును ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కల్యాణసుందరం, మంజుల, ప్రియకు గాయాలయ్యాయి వెంటనే ప్రమాదంపై సమాచారం అందుకున్న ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన జీపును పక్కకు తొలగించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ: ఒకరి మృతి



జయపాల్ నాయుడు మృతదేహం

చంద్రగిరి: పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలోని ఐతేపల్లి సమీపంలో సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. ముంగిళిపట్టుకు చెందిన జయపాల్ నాయుడు (50) సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో చంద్రగిరికి బయలుదేరాడు. మార్గం మధ్యలోని ఐతేపల్లె వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. గాయపడిన జయపాల్‌నాయుడు మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డిప్యూటీ సీఎం రాక

తిరుపతి అర్బన్: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మంగళవారం సాయంత్రం 4 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4.50 గంటలకు అలిపిరి శ్రీవారి పాదాల మెట్ల మార్గంలో కాలినడకన రాత్రి 8గంటలకు తిరుమలకు చేరుకుంటారని చెప్పారు. రాత్రి తిరుమలలో బస చేస్తారని, బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు. అనంతరం 11.05 గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద్ కేంద్రాన్ని తనిఖీ చేస్తారన్నారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు తిరుపతిలోని వారాహి సభ కార్యక్రమంలో పాల్గొంటారని, రాత్రి 8.30 గంటలకు విజయవాడకు వెళ్లతారని వెల్లడించారు.

‘చోరీ’ మణులు..!

ఇద్దరు మహిళా దొంగల అరెస్టు



మాట్లాడుతున్న చంద్రగిరి డీఎస్పీ, రూరల్ సీఐ

తిరుపతి రూరల్: భార్యభర్తలు కలిసి వస్తారు. ఇళ్లకు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొరికిన కాడికి దోచుకుని ఎంచక్కా వెళ్లిపోతారు. ఈ కోవకు చెందిన హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు మహిళా దొంగలను తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో చంద్రగిరి డీఎస్పీ బేతపూడి ప్రసాద్, రూరల్ సీఐ చిన్నగోవిందుతో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్ శ్రీనివాసకాలనీకి చెందిన శెట్టి లక్ష్మి, శెట్టి మీనా వారి భర్తలు విజయ్, మణితో కలిసి ఈ నెల 20వ తేదీన తిరుపతి రూరల్ మండలం ఓటేరులోని 3 ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. రూ.29 లక్షల విలువైన సొత్తును దోచుకెళ్లినట్లు చెప్పారు. దీనిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, నిందితులు శెట్టి లక్ష్మి, శెట్టి మీనాలను తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లి చెక్ పోస్టు వద్ద అరెస్టు చేసి, వారి నుంచి 86 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టులో ప్రతిభ చూపిన సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ షేక్షావలి, ఎస్‌కె మూర్తి, ఏఎస్ఐ రాఘవనాయుడును అభినందించారు.

అంతా మా ఇష్టం



నారాయణపురం చెరువులో మట్టి తవ్వుతున్న జేసీబీ



ఓ తెలుగుదేశం నేత సైట్‌కు మట్టి తోలుతున్న ట్రాక్టర్లు

- మట్టి మాఫియా బరి తెగింపు
- తెలుగుదేశం నేతల అండతో అక్రమాలు

శ్రీకాళహస్తి: అధికారపార్టీ అండదండలతో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. గత మూడు నెలలుగా రాత్రి వేళలో మాత్రమే మట్టిని తరలించేవారు. ప్రస్తుతం బరి తెగించి పట్టపగలే అధికార పార్టీ అండదండలతో శ్రీకాళహస్తికి కూతవేటు దూరంలో ఉన్న స్కిట్ కళాశాలకు ఆనుకుని ఉన్న నారాయణపురం చెరువులో జేసీబీలతో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ తతంగమంతా అధికారులు తెలిసే జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో మెగా కంపెనీ ప్రభుత్వానికి, పంచాయతీకి డబ్బులు చెల్లించి మట్టిని తరలిస్తుంటే టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నేతలు మట్టి తరలిస్తున్నారని గగ్గోలు పెట్టారు. అయితే నేడు పట్టపగలే 50 ట్రాక్టర్లు జేసీబీతో మట్టిని తవ్వి హౌసింగ్‌బోర్డు సమీపంలో ఓ టీడీపీ నేత స్థలంలోకి తరలిస్తుంటే అధికారులందరూ కళ్లు మూసుకుని ఏమీ ఎరగనట్లుగా ఉంటున్నారు. చుట్టుపక్కల అన్ని చెరువుల్లోనూ ఇష్టారాజ్యంగా మట్టి, స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వి తరలిస్తున్న టీడీపీ నాయకులకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. స్వర్ణముఖి నదిలో ఇసుకను ఓ టీడీపీ నాయకుడు డంప్ చేసుకుని చెన్నైకు తరలిస్తున్నారు. ఈ విషయమై అధికారులను ఫోన్‌లో వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని సమాధానమిస్తున్నారు. తహసీల్దార్‌ను సంప్రదించాలని ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం, వ్యాన్‌తో అధికారులు

దొరవారిసత్రం: చెన్నైకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంతోపాటు మినీ వ్యాన్‌ను అధికారులు పట్టుకున్న ఘటన సోమవారం పోలిరెడ్డిపాళెం సమీపంలోని బస్ షెల్టర్ వద్ద చోటు చేసుకుంది. సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య కథనం మేరకు... మండలంలో చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి మినీ వ్యాన్ ద్వారా చెన్నైకు అక్రమంగా తరలిపోతున్నట్లు సమాచారం అందడంతో విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణనాయక్, సివిల్ సప్లయ్ అధికారులు ఉమ్మడిగా పోలిరెడ్డిపాళెం బస్‌షెల్టర్ వద్ద నిఘా పెట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మినీ వ్యాన్‌ను ఆపి, తనిఖీ చేశారు. అందులో రూ. 1.05 లక్ష విలువ చేసే 3,350 కిలోల రేషన్ బియ్యం 67 ప్లాస్టిక్ సంచుల్లో ఉండగా గుర్తించారు. వ్యాన్‌తో పాటు రేషన్ బియ్యం సీజ్ చేశాకె. అలాగే డ్రైవర్ వీ రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఎస్ డీటీ తెలిపారు.

రైతులకు పంట నష్టపరిహారం

75 మంది రైతులకు రూ.13.56 లక్షల జమ

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్: అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులకు ఎట్టకేలకే నష్టపరిహారం అందింది. తిరుపతి జిల్లాలో ఆగస్టు నెలలో కురిసిన అకాల వర్షాలతో 75 మంది రైతులకు చెందిన 134 ఎకరాల వరి పంట దెబ్బతింది. అయితే సెప్టెంబర్ 20వ తేదీ వరకు వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచనాలు వేయడంతోనే కాలయాపన చేశారు. దీంతో ఈ నెల 22వ తేదీన సాక్షి దినపత్రికలో ‘పంట నష్టం అంచనాకు నెల’ అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వ్యవసాయ శాఖాధికారులు ప్రభుత్వానికి నివేదికను పంపడంతో రైతుల ఖాతాల్లో రూ.13.56 లక్షలు జమ చేశారని ఏఓ ప్రసాద్‌రావు సోమవారం తెలిపారు.